ABN
ఆంధ్రజ్యోతి

# డ్రగ్స్, గంజాయి రహిత జిల్లాగా మార్చాలి

» ఎస్పీ రంజన్ రతన్‌కుమార్ » జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు

» హాజరైన స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు

గద్వాల క్రైం/ గద్వాల/ ఉండవల్లి/ వడ్డేపల్లి/ రాజోలి, జనవరి 31 : జోగుళాంబ గద్వాలను డ్రగ్స్, గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు అధికారులు, సిబ్బంది బాధ్యతతో కృషి చేయాలని ఎస్పీ రంజన్ రతన్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారులు, సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యకరమైన తెలంగాణ కోసం డ్రగ్స్, గంజాయిని సమూలంగా నిర్మూలించాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్, డీజీపీ మహేందర్‌రెడ్డి నిర్ణయాన్ని జిల్లాలో కఠినంగా అమలు చేసేందుకు పోలీస్ అధికారులు బాధ్యతతో కృషి చేయాలన్నారు. డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలను వినియోగిస్తున్న, ఉత్పత్తి, సరఫరా చేస్తున్న వారిని గుర్తించి కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. హోంగార్డు అధికారి నుంచి పైస్థాయి అధికారి వరకు ఈ విషయంపై సీరియస్‌గా ఉండాలన్నారు. గ్రామ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలలో నెట్‌వర్క్ ఏర్పరచుకొని యువత, వృత్తిపనులు చేస్తున్న వారిపై నిఘా ఉంచాలన్నారు. వ్యవసాయ భూములపై నిఘా ఉంచాలని, గ్రామాలను సందర్శించి యువత అలవాట్లను, జీవన విధానాన్ని తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి వీటిని పూర్తిగా నివారించాలన్నారు. సమావేశంలో డీఎస్పీ రంగస్వామి, సాయుధ దళ డీఎస్పీ ఇమ్మానియేల్, గద్వాల సీఐ షేక్ మహబూబ్ బాష, అలంపూర్ సీఐ సూర్యానాయక్, శాంతినగర్ సీఐ శివశంకర్ పాల్గొన్నారు.

### ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు : సీఐ

డ్రగ్స్, గంజాయి ఉత్పత్తి, సరఫరా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని గద్వాల సీఐ షేక్ మహబూబ్ బాష హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా ప్రజాప్రతినిధులు వారికి అవగాహన కల్పించాలని సూచించారు. మండల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో పాటు మాజీ సర్పంచులతో సోమవారం జిల్లా కేంద్రంలోని హరిత హోటల్‌లో, పట్టణ పోలీస్‌స్టేషన్లో అవగాహనా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా డ్రగ్స్ గంజాయి లాంటి పదార్థాలు కలిగివుంటే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామాలలో గంజాయి సాగు చేసే వారిపై పీడీ యాక్టు పెట్టడంతో పాటు రైతుబంధును నిలిపి వేయిస్తామని హెచ్చరించారు. అదే విధంగా పెద్ద మొత్తంలో లభ్యం అయితే ఆ గ్రామానికే రైతుబంధు, సంక్షేమ పథకాలను నిలిపివేయిస్తామని చెప్పారు. ప్రజా ప్రతినిధులుగా గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్గించాలని, అవసరమైతే తమకు సమా చారం ఇవ్వాలని చెప్పారు. ఆయా సమావేశాల్లో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, వైస్ చైర్మన్ బాబర్, పట్టణ ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి, ఎస్ఐ ఆనంద్ పాల్గొన్నారు.

### 4జీ రహిత మండలంగా తీర్చిదిద్దుదాం

ఉండవల్లిని ఫోర్-జీ (గంజాయి, గుట్కా, గుడుంబా, గ్యాంబ్లింగ్) రహిత మండలంగా తీర్చిదిద్దుదామని అలంపూర్ సీఐ సూర్య నాయక్ అన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫోర్-జీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్ది, నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములం అవుదామని ప్రజా ప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు.

### మత్తు పదార్థాలు వాడితే కఠిన చర్యలు

గుట్కా, గుడుంబా, గంజాయి, గ్యాంబ్లింగ్ వ్యసనాలకు అలవాటుపడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని శాంతినగర్ ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. శాంతినగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మునిసిపల్ చైర్మన్, కౌన్సిలర్లతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి సాగు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు తమ ప్రాంతాల్లో నిఘా ఉంచి, మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రాజవర్ధన్‌రెడ్డి, కానిస్టేబుల్ గోకారి పాల్గొన్నారు.

### జీవితాలను నాశనం చేసుకోవద్దు

యుక్తవయస్సులో గుట్కా, గంజాయి వంటి మత్తుపదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ లెనిన్ సూచించారు. వడ్డేపల్లి మండలం బుడమెరుసు, తుమ్మిల గ్రామాల్లో సోమవారం నిర్వహించిన అవగాహనా సదస్సుల్లో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో గుట్కా, గంజాయి, గుడుంబా లాంటి మత్తు పదార్థాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### కఠిన చర్యలు తప్పవు

దుకాణాల్లో మత్తుపదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని రాజోలి ఎస్ఐ లెనిన్ హెచ్చరించారు. మండలంలోని తుమ్మిళ్ల, రాజోలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బుడమర్సు గ్రామాల్లో సోమవారం నిర్వహించిన అవగాహనా సదసుల్లో ఆయన మాట్లాడారు. రైతులు తమ పొలాల్లో గంజాయి సాగు చేస్తే రైతుబంధుతో పాలు ఇతర సంక్షేమ పథకాలను నిలిపివేయనున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రంజన్ రతన్‌కుమార్, హాజరైన అధికారులు, సిబ్బంది



ఉండవల్లిలో మండల ప్రజా ప్రతినిధులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ